


# నవ ప్రభాతం

పి. ప్రేమచంద్ర

వేసవి శెలవల తర్వాత ఆ రోజే కాలేజీలు తెరిచారు. మళ్లా విద్యార్థులు చేతిలో పుస్తకాలతో సహా రోడ్లమీద కనబడసాగారు ఆ రోజునుండే హాస్టల్సు కూడా వాటి పని అవి మొదలుపెట్టాయి. సీనియర్ క్లాసుల్లో ఉన్న పిల్లలు హాయిగా, స్వతంత్రంగా హాస్టలులోకి వచ్చి వాళ్ల పూర్వపు గదుల్లో మళ్లా వాళ్ల సామానంతా సర్దుకుంటూ, పాత స్నేహితులను కలుసుకుంటూ, అత్తవారింటినుండి పుట్టింటికి వచ్చిన ఆడబడుచుల్లా సరదాగా కబుర్లాడుకుంటూ ఉన్నారు కాని, వచ్చిన చిక్కలా క్రొత్తగా కాలేజీలో ప్రవేశించేవారికి, యింతకు ముందు ఎప్పుడూ గడపదాటి ఎరుగకుండా ఇప్పుడు హాస్టలు మఖాం చెయ్యవలసి వచ్చిన వారికి! ఏమంటే వాళ్లకి ఆ పరిసరాలు, వ్యక్తులు క్రొత్తగా ఉంటారు ఎవరితో ఎలా ఉండాలో ఎరగని పరిస్థితుల్లో ఉంటారు అందుచేత!

మాలతి స్వగ్రామంలో హైస్కూలు చదువు ముగించుకుంది ఇంటర్మీడియేట్ ప్రయివేటుగా పాసయింది. బి ఏ., కాలేజీలో చదవాలనిపించి కాకినాడ వచ్చింది. ఆడపిల్లల హాస్టలులో చేరింది. స్వతహాగా మాలతి చలాకీగా ఉంటుంది. అందర్నీ నవ్విస్తూ, తానుమాత్రం ఏమాత్రం చలించకుండా చక్కగా మాట్లాడుతుంది కాని ఇప్పుడు పట్టణం, అందులోను చదువు కొరకై రాగానే, మాలతికి మనస్సులో బెంగ పట్టుకుంది ఎవరితోను మాట్లాడకుండ ఏమిటో ఆలోచించుకుంటూ, అమ్మ జ్ఞాపకం వచ్చినప్పుడు కళ్లలో నీళ్లు తిరిగితే, ఎవరూ చూడకుండా తుడిచేసుకుంటూ రోజులు వెళ్ళబుచ్చ సాగింది. తక్కినవాళ్లు ఈ అమ్మాయికి గర్వమేమోనని నిర్ధారణ చేసుకున్నారు. మరికొందరు కాస్త 'రిజర్వుడు టైప్' గాబోలునని సరిపెట్టుకున్నారు కాలేజీ తెరచిన మొదటి రోజుల్లో పారా లుండకపోవడం మాలతికి మరీ తోచకుండా చేసింది.

కాని, కొన్ని రోజుల తర్వాత తన రూమ్మేటుతో క్రమేణా మాట్లాడటం మొదలుపెట్టింది మాలతి. రోజులు గడుస్తున్నకొద్దీ తక్కిన విద్యార్థినులు, వాళ్లు వేసుకున్న అంచనాలు మాలతిపట్ల తారుమారవటం చూచి, ఆమెను వేరే విధంగా అర్థం చేసికోడానికి ప్రయత్నించారు. తాను వాళ్లందరిమధ్య మళ్లా ఒక మనిషిగా తిరగడానిక మాలతి ఒక నెల రోజులు తీసుకుంది

మాలతీ లతలాగా సన్నగా, నాజూగ్గా ఉంటుంది మాలతి చామనచాయే అయినా అంగసౌష్టం మాత్రం తీర్చి దిద్దినట్లుండి ఎవరి కంటినైనా అప్రయత్నంగా ఆవైపు త్రిప్పుకునేట్టు చేస్తుంది. ఆమెను చూస్తే అజంతా చిత్రాలని వేరే చూడ నవసరం లేదేమో ననిపిస్తుంది మొఖం ఎప్పుడూ కళకళలాడుతూ ఉంటుంది. ఆ కళ్లు మిలమిలా మెరుస్తూ ఏవో మూగ భాషలు మాట్లాడుతున్నాయా అని అనిపిస్తుంది చూచినవారికి 'అమ్మాయి క్రిస్టియను కాబోలు,

కథానిక

బొట్టులేదు. బొట్టు ఉంటే ఇంకా నిండుగా ఉండును' అన్న ఆలోచన రాకమానదు

* * *

ఆ రోజు ఆదివారం. భోజనాలు ముగించుకుని, మాలతి ఆమె రూంమేటు ప్రమీల వాళ్ల గదిలో కూర్చుని ఏదో పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. మాటల సందర్భంలో ప్రమీల తనవద్ద నున్న ఫొటోలన్ని తెచ్చి చూపించుతూ ఏమేమో చెబుతూ ఉంది. అది అయిన తర్వాత మాలతి కూడ ఒక ఫొటొతెచ్చి ప్రమీలకిచ్చింది.

అది మాలతి ఫొటొ. కాకినాడ రాకముందు తీయించుకుంది. ఆ ఫొటొ వైపు ప్రమీల క్షణం రెప్ప వాల్చకుండ చూచి,

''అబ్బ! ఎంత అందంగాఉన్నావు మాలతీ! బొట్టుపెట్టుకోడం నీ కిష్టం ఉండదా? బొట్టు ఉంటే మరీ అందంగా ఉండేదానివి సుమీ!'' అంటూ తన దారిన తాను మాట్లాడుతూ ఫొటొ వైపు దీక్షగా చూస్తూ కూర్చుంది.

మాలతి వచ్చే దుఃఖాన్ని బలవంతంగా ఆపుకోడానికి తంటాలు పడుతూంది కాని ఆ ప్రయత్నాలన్ని విఫలమయి చిన్నశబ్దం వెలికి వచ్చింది. వెంటనే ప్రమీల తల తిప్పి చూచింది.

''అయ్యో!అదేమిటి, మాలతీ!ఏంజరిగింది? ఎందుకేడుస్తున్నావ్! ఊరుకో! అసలు సంగతేమిటి?'' ఎన్ని ప్రశ్నలు వేసినా మాలతినుండి ఏడుపు తప్ప జవాబురాలేదు. కాస్సేపు కూర్చుని ప్రమీల ఇంక చేసేది లేక తన బల్లదగ్గరకు వెళ్ళి కూర్చుంది. ఆ రోజంతా అలాగే గడచింది. మాలతి ఏడుపుకి తగిన కారణం ఏమిటో బోధపడక ప్రమీల తికమక పడుతూంది. తానేమైనా అన్నానేమోనని కాస్సేపు ఆత్మపరీక్ష కూడ చేసికొంది కాని తన కలాంటిదేమి స్ఫురించడంలేదు.

ఆ రాత్రి మాలతి సరిగ్గా భోజనం చెయ్యలేదు. ఆ సంఘటన ప్రమీలను మరీ బాధపెట్ట సాగింది. రాత్రికెలాగైనా సరే సమస్యా పరిష్కారం కావాలి అనుకుంది ఇద్దరూ పక్కలు పర్చుకు పడుకున్నారు

''మాలతీ! ఏమిటి సంగతి? నాతోచెప్పవా? ఎప్పుడూ సరదాగాఉండే నీవు అలాఏడ్వడానికి కారణం ఏమిటి? నేనేమైనా నిన్ను బాధపరచే మాట అన్నానా? అలాఅయితే క్షమించు...'' మాలతి గబుక్కున ప్రమీల చేయి పట్టుకుని.

''అబ్బే! అలాంటి దేమిలేదు. నా దుఃఖానికి మీ రెందుకు కారణమవుతారు ప్రమీలా! ఇదంతా నా ఖర్మ''

''అదేమిటి? ఖర్మ సిద్ధాంతంలో పడ్డావ్! ఇదిగో! మాలతీ, ఇటు చూడు! నీ మనసులోది ఎవరితోనైనా చెప్పేస్తే నీకు కాస్త బరువు తగ్గినట్టుంది. నన్ను నీ ఆప్తురాలినిగా భావించు చెప్పు!" అంది ప్రమీల బ్రతిమలాడే ధోరణిలో

''చెప్పనా! సరే! కాని పక్కగదుల్లో వాళ్లకు నిద్రాభంగమవుతుందేమో! అయినా నెమ్మదిగా చెప్తాలే,'' అని మాలతి చెప్పడం ప్రారంభించింది.

* * *

''మా అమ్మకి, నాన్నకి నేనొక్కర్తినే బిడ్డను. నా చిన్నతనంలోనే మా నాన్న పోయారు నాకసలు ఆయన రూపమే జ్ఞాపకం లేదు. నాకు నాలుగో సంవత్సరం వచ్చేసరికి నా పెళ్ళికి ఒక సంబంధం వచ్చిందట. వాళ్లు ఆగర్భశ్రీమంతులు. ఒక్కడే కొడుకు అబ్బాయికి పదోఏడు. మాది పల్లెటూరు. అందులోను పూర్వాచార పరులైన బ్రాహ్మలు-మా కుటుంబీకులు శారదా చట్టం అమల్లో-ఉన్నా. 'తండ్రిలేని పిల్ల. దాన్ని నేను బ్రతికుండగా ఓ ఇంటిదాన్ని చేస్తే నా బాధ్యత తీరుతుంది'అని మా అమ్మ ఆలోచించి నా పెళ్ళికాస్త చేసేసింది. ఆ అబ్బాయి అప్పుడప్పుడూ మా ఇంటికి వస్తూఉండేవాడు. అతను చిన్నక్లాసులు చదివే కుర్రాడిగానే ఇప్పటికి నాకు లీలగా కనిపించినట్టవుతుంది

అప్పుడు నేను సెకెండు ఫారం చదువుతున్నా. ఆరోజు సాయంత్రం బడినుండి ఇంటికి వచ్చేసరికి, ఇంట్లో దృశ్యం చాల భయంకరంగా ఉంది. మా అమ్మ శోకాలుపెట్టి ఏడుస్తోంది ఇంకా చుట్టుప్రక్కలవాళ్ళుకూడ విచారంగా నిలుచున్నారు నాకు కారణం తెలియకపోయినా, అమ్మ ఏడ్వటంచూచి నేనూ ఏడుపు మొదలుపెట్టాను. అప్పటివరకూ ఎవరూ నా

రాక గమనించలేదు గాబోలు, నా స్వరం విన గానే అంతా నావైపు తిరిగారు. అమ్మ పరి గెత్తుతూవచ్చి నన్ను కౌగలించుకు భోరున ఏడ్వసాగింది.

తర్వాత అర్ధమయ్యింది నాకు. నా భర్త, అంటే అప్పటికి కుర్రాడేగదా! బడినుండివస్తూ ప్రమాదవశాత్తూ బస్సుక్రింద పడిపోయాడట. ఆసుపత్రికి తీసికెళ్లినా లాభంలేకపోయింది. తరువాత నాకు జరగవలసిన తంతు అంతా యధావిధిగా జరిపించారు. నాకు మాత్రం అప్పుడు ఏడుపు రాలేదు. అంతా నన్నుచూచి విచారించేవాళ్లు.

నేను పోర్తుఫారంకి వచ్చి, నాకు బాగా ఊహ తెలిసింతర్వాత నన్ను ఎవరైనా 'విధవ' అంటే చాలాకోపమొచ్చేది. ఒకొక్కరాత్రి ఏదో ఆలో చించుకుంటూ 'నేను విధవనా!' అన్నతలంపు వచ్చినప్పుడు ఎంతోసేపు ఏడ్చేదాన్ని. మా ఇంటిప్రక్క ఒక బామ్మగారుండేదిలే! ఆవిడ, నేను ఒక కేటగిరిలోనివాళ్ళమే అన్న తలంపు వస్తే ఏడవాలో నవ్వాలో తెలిసేదికాదు. కాని మా అమ్మకుమాత్రం ఎప్పుడూ ధైర్యంచెబుతూ ఉండేదాన్ని. నా భర్త ఆస్తిఅంతా ఇప్పుడు నా పేరనే ఉంది. ఇంట్లో ఉంటే ఏంతోస్తుందని చదువుకుంటానంటే మాఅమ్మ సరేనంది. ఇదీ నా కథ. నాకెన్నోసార్లు బొట్టు పెట్టుకుందామని ఇంకా ఏమో చెయ్యాలని ఉంటుంది. కాని ఏం చెయ్యబోయినా మనస్సు ఏమిటో పీకుతుంది. అన్నీ శంకలే!'' అని ముగించింది మాలతి.

''అంత బెంబేలు పడతావెందుకు మాలతీ! ఇప్పుడు మన మే శతాబ్దంలో ఉన్నామో నీకు తెలియదా?''

''ఆ! నీకు అనుభవంలేక అలా అంటు న్నావ్! అంటే, నాకుందా అని అడుగుతా వేమో! నా యీ స్థితి నన్ను ముసలివాళ్ళలో చేర్చినట్టేగదా! వితంతువుని వివాహం చేసికో డానికి నూటికో, కోటికో ఒకరు ముందుకు వస్తారు. అయినా ఇదేమైనా డిబేట్సులో మాట్లా డటం లాంటిదా! అలా ఏదైనా మాట్లాడమంటే ఈనాటి యువకులంతా వితంతు వివాహం అవ సరమనే అరుస్తారు. చివరకు జీవితంలో అది కార్యరూపం పెట్టమనేసరికి ఒక్కడు ముందుకు రాడు కథల్లో జరిగినట్టు జీవితంలో జరగటం చాలకష్టమే! తల్లీ!!''

''ఆ! చాలా పొద్దుబోయింది. పడుకుం దామా!'' అంది మాలతి.

కీచురాళ్ల శబ్దం తప్ప, హాస్టలులో నిశ్శబ్దం ఆవరించింది.

* * *

ఇలా రోజులు గడుస్తున్నాయి. మాలతి అందరి సానుభూతి సంపాదించుకుంది అంద రికి ఆమె అంటె ఒక విధమైన జాలి.

ఒకరోజు ప్రమీల మీనాక్షి వాళ్ళ గదిలోకి వచ్చి కూర్చుంది.

''మాలతి లేదా ఏం! మా గదికి వచ్చావు?'' అని పలకరించింది మీనాక్షి.

''ఏం, రాకూడదా? మాలతి వార్డెనుగారి దగ్గర కెళ్ళిందిలే! పాపం! మాలతి సంగతి నాకెప్పుడూ విచారంగా ఉంటుంది. అంత డబ్బుంది; కాని ఏం లాభం! మనబోటివాళ్లు జీవితంలో అనుభవించవలసింది ఇంకేదో ఉందని నిరీక్షిస్తూ ఉంటాం. ఆ నిరీక్షణలో హాయి ఉంది. కాని మాలతికి ఆ నిరీక్షణే లేదు. పాపం! అంతా అయిపోయిన ముసలిదానిలా ఒకొక్కసారి నిస్పృహ చెందుతూంటుంది.'' అంది ప్రమీల.

''లేదర్రా! మన ఒక తీర్మానం చేసు కుందాం.'' అంది మీనాక్షి ఆలోచిస్తూ.

''ఏమిటది?''—అన్నారు ప్రమీల, మీనాక్షి రూంమేటు జానకి.

''ఆ! ఏం లేదు. మనలో అన్నయ్యలున్న వాళ్ళంతా మాలతి సంగతి వాళ్ళకు చెప్పి వారిలో ఎవరైనా ఆమెను వివాహం చేసు కునేలా చేద్దాం. ఒకళ్ళకన్న ఎక్కువ మంది ముందుకువస్తే అప్పుడు స్వయంవరం!'' అంది మీనాక్షి,

''చాల్లే! వేళాకోళానికి వేళాపాళా లేదు నీకు'' అంది ప్రమీల.

''వేళాకోళం కాదోయ్! సీరియస్‌గానే అంటున్నా'' అంది మీనాక్షి.

"ఆఁ! అనవూ! నీకెవరూ అన్నలు లేరుగా, అందుకు, ఏం!" అంది ప్రమీల.

"ఏం, జానకీ! మీ అన్నయ్య 'లా' చదువు తున్నాడు గదూ!"

"అబ్బే! మా అన్నయ్యకు సంబంధం కుదిరిపోయిందోయ్!" అని తప్పించుకుంది జానకి.

"మరి ఇక మిగిలింది ప్రమీల అన్నయ్యే!" అంది మీనాక్షి.

"చాల్లే! చుట్టూ తిప్పి నామీదకే తెచ్చావా? మా అమ్మ నిలేసి తంతుంది తెలుసా!"

"మరి ఇప్పటి వరకు ఏమేమో మాట్లాడావే! అవునులే, మాట్లాడటం సులభంగాని, చేతలో పెట్టె వేళకు కష్టమే మరి! కాని మీ అన్నయ్యకు మాలతికి ఈడు, జోడు చక్కగా ఉంటుంది— చూడు! ప్రమీలా! నీవు అనుకుంటే మాత్రం మీ అమ్మ నెలాగైనా ఒప్పించగలవు మీ అన్నయ్య సంగతి కావాలంటే నాకు వదలి పెట్టు. ఏం!" అంది మీనాక్షి.

"ఏమో బాబూ! మన కెందుకా గొడవలు" అని నెమ్మదిగా జారుకుంది ప్రమీల.

వెళ్ళిపోతున్న ప్రమీలవైపు చూస్తూ మీనాక్షి అంది—

"ఇంతలో బయటపడతారు మనుష్యులు. చూచావా, జానకీ! ప్రమీల ఎలా వెళ్ళిపోయిందో. మన సంఘంలో ఇప్పుడుకూడా ఇలాంటి సంస్కరణ ఏదైనా చెయ్యాలంటే చచ్చినంత గొడవ నరేలే! ఏమి జరగనున్నదో ఎవరికి తెలుసు!"

* * *

మాలతికి ఆ రోజు జ్వరం చాలా తీవ్రంగా ఉంది. హాస్టలు డాక్టరు కామాక్షమ్మగారు వచ్చి చూచి "హాస్పిటల్‌లో చేర్పించండి. అన్ని సదుపాయంగా ఉంటాయి" అని చెప్పి వెళ్ళింది. ఆ మర్నాడు వార్డెను మాలతిని హాస్పిటల్‌లో జాయిన్ చేసి వచ్చింది ఆ రోజంతా జ్వరం తీవ్రంగానే ఉంది. ఆ రాత్రి మాలతికి నిద్రకి మందు ఇచ్చారు. దానివల్ల బాగానే నిద్రపోయింది. తెల్లవారి కళ్లు విప్పేసరికి ఎదురుగా డాక్టరు, నర్సు నిలబడి ఏమో మాట్లాడుకుంటున్నారు.

"ఏమండీ! నిద్ర బాగా పట్టిందా? నర్స్! టెంపరేచర్ చూడు" అన్నారు డాక్టర్‌గారు. టెంపరేచరు కొద్దిగా తగ్గిందనిచెప్పి నర్సు వెళ్ళిపోయింది.

"మీరు లేడీస్ హాస్టల్‌లో ఉన్నారా? మరి మా ప్రమీల మీకు తెలిసేఉండాలి" అన్నారాయన.

"అవునండీ. ప్రమీల నా స్నేహితురాలే. ఆ అమ్మాయి మీకు తెలుసా!" అంది సరిగ్గా లేచి కూర్చుంటూ.

"తెలుసా ఏమిటి. మా చెల్లెలేనండీ! నేను ఈ హాస్పిటల్‌కు మొన్ననే వచ్చాను. మాఅమ్మ వాళ్లువస్తే అప్పుడు ప్రమీలకూడ నాతోనే ఉంటుంది."

"అయ్యో! నా రూంమేటు వెళ్ళిపోతే ఎలా?" అంది అమాయకంగా మాలతి.

"అప్పుడే విచారించకండి. ఇంకా మీ ఫ్రెండ్ వెళ్ళలేదుగా" అన్నాడు నవ్వుతూ.

"అన్నట్టు మీ పేరేమిటో చెప్పారుకాదు?" అంది మాలతి.

"మధుసూదన్ అంటారు. మరి మీపేరు" అని అడిగాడు.

"మధు" ఎంత చక్కనిపేరు అనుకుంటూ తన పేరుకూడా చెప్పింది.

"మరి నే వస్తాను. మీరు మొఖం అది కడుక్కోండి" అని వెళ్ళిపోయాడు.

ఆ సాయంత్రం ప్రమీల, మీనాక్షి, జానకి స్నేహితురాలిని చూడ్డానికి హాస్పిటల్‌కు వచ్చారు. వాళ్లు వార్డులో అడుగుపెడుతూనే చూచిన దృశ్యమిది. మాలతి నీట్‌గా డ్రెస్ చేసుకుంది. డాక్టర్ మధు ఆమె ప్రక్కనేఉన్న స్టూలుమీద కూర్చున్నాడు. ఇద్దరూ ఏదో మాట్లాడుకుంటున్నారు. మాలతి కళ్లు ఎర్రగా ఉన్నాయి. ఏడ్చినట్టుంది. బహుశః మధుకు తన చరిత్ర వినిపించి ఉంటుంది.

పిల్లముగ్గురూ మాలతి బెడ్ దగ్గరకు వెళ్ళారు. ఎలాఉంది అని పరామర్శించారు.

"ప్రమీలా! నీ అన్నయ్య ఇక్కడున్నట్టు చెప్పావుకావేఁ!" అంది మాలతి

మీనాక్షి వెంకిగా ప్రమీల వైపు చూచింది

ప్రమీల ఏమీచెప్పలేక నవ్వేసి ఊరుకుంది. కాస్సేపు మాట్లాడిన తర్వాత వాళ్లు వెళ్ళిపోయారు. ఆ రాత్రి ప్రమీల తానేదో ఓడిపోయినట్టు భావించసాగింది. ఏమేమో ఆలోచనలు రాసాగాయి. 'అన్నయ్య, మాలతిల కలయికకు మీనాక్షి ప్రమేయ మేమైనా ఉందా? మాలతికి మళ్ళీ పెళ్ళిచేసుకోటానికి అభ్యంతరంలేరు ఆడవాళ్ళ మనస్సునే ఆకర్షించగల మాలతి అందం, అన్నయ్యను ఆకర్షించ్కక మానదు మీ అన్నయ్య "విడో"ని పెళ్ళిచేసుకున్నాడటగా! అని ఎవరైనా అంటే అది ఎంత చిన్నతనం! ఎవరూదొరక్క చివరకి వెధవని చేసుకున్నాడనికూడ అంటారు. పాపం! మాలతి మంచిదే, కాని ఆమెకున్న ఆ మచ్చ లేకుండా ఉంటేనా, ఎగిరి గంతేసి అన్నయ్యకు చేసేసెదాన్ని" అంటూ ఏమేమో ఆలోచించుకుంటూ నిద్రపోయింది.

మాలతి హాస్పిటల్ నుండి వచ్చేసింది. అక్కడినుండి వచ్చింతర్వాత పూర్వంకన్నా ఎక్కువ ఆనందంగా ఉన్నట్టు కనబడేది సాధారణంగా సాయంత్రం ఒంటరిగా ఎక్కడి కన్నా వెళ్తుండేది ఇవన్నిచూస్తుంటే ప్రమీలకు మరీ అనుమానంగా ఉండేది కాని ఏం చేయగలదు?

ఓరోజు మాలతి ఎక్కడికో వెళ్ళింది. ఆమె వెళ్ళింతర్వాత ప్రమీల, జానకి, మీనాక్షి ముస్తాబయి కనకమహాలక్ష్మి కోవిలకు బయలు దేరారు. దారిలో పండూ, ఫలం ఏవేవో కొన్నారు. ముందు మీనాక్షి నడుస్తూంది వెనుకగా ఆ ఇద్దరూ మీనాక్షి గదిలో అడుగు పెట్టగానే దేవాలయ మంటపంలో స్థంభాని కానుకున్న మధు కనబడ్డాడు గర్భ గుడిలో మాలతి రెండు చేతులూ జోడించి కండ్లు మూసుకొని నిలబడి ఉంది. ఆ ముఖంలో భక్తి ఉట్టిపడుతూ ఉంది. మధు మీనాక్షిని చూడగానే "నే నున్నట్టు చెప్పకు. ఈ దారిన రావద్దు నీకు దణ్ణం పెడుతాను" అన్నట్టుగా సౌంజ్ఞలు చేయటం మొదలుపెట్టాడు. అది చూచేసరికి మీనాక్షికి నవ్వాగలేదు. ఇంతలో ప్రమీల, జానకి రానే వచ్చారు.

ప్రమీల మధు ఉన్నవైపే నడవటం చూచి మీనాక్షి ఇలా అంది.

"ఏయ్! ప్రమీలా! మనం ఇటువైపు వెళ్దాం రా, అటు వద్దులే!" అంది,

సరేనని ప్రమీల ఇటుగా వచ్చేసరికి గర్భ గుడిలో విగ్రహం చుట్టు ప్రదక్షిణ చేస్తున్న మాలతి కనిపించింది

"అరె! మాలతి ఇక్కడుందే! అయితే మా అ " గబుక్కున చెప్పదలచుకొన్నది ఆపేసింది ప్రమీల ఏం అనుమానం వేసిందో, మొదట వెళ్ళినవైపే గబగబ వెళ్ళింది ఏముంది? అక్కడ మధు స్థంభాని కానుకొని ఏదో ఆలోచిస్తూ నిలబడి ఉన్నాడు.

"ఏంరా, అన్నయ్యా! సిగ్గులేదురా నీకు, ఆడపిల్లతో గుడికి వచ్చావా? ఛీ! అయితే చాల వరకు వచ్చిందన్నమాట ఉండు, అమ్మకు వ్రాస్తా!"నంటూ గబ గబ తెచ్చిన కొబ్బరి కాయైనా కొట్టకుండా మధు, మీనాక్షి తన్ను పిలుస్తున్నా వినిపించుకోకుండా రయిన వచ్చిన దారినే హాస్టలుకు వెళ్ళిపోయింది.

ఇంతలో మాలతి బయటకు వచ్చింది

"అదేమిటి! మీ వదినగార్కి కోపమొచ్చినట్టుంది అలా వెళ్ళిపోతోందే!" అని నవ్వుతూ అనగానే తక్కినవాళ్లుకూడ ఆమెతో శృతికలిపారు వాళ్లంతా గుడినుండి పార్కుకు వెళ్ళి కాస్సేపు కులాసాగా గడిపి, తరువాత ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు

మాలతి గదిలోకి వచ్చింతర్వాత ప్రమీల తననేమైనా అడుగుతుందేమోననుకుంది కాని ప్రమీల ఏమీమాట్లాడకుండ అసలావైపే చూడకుండ ఏదోవ్రాస్తూ కూర్చుంది బహుశః ఆ వేడిలో వాళ్ళఅమ్మకు అన్నయ్యమీద ఫిర్యాదేమో!

ప్రమీల ఉత్తరం ఎంత ఘాటుగా వ్రాశిందో ఏమో, మూడోనాటికల్లా వాళ్లఅమ్మ కొడుకు దగ్గరకువచ్చి వాలింది.

"నాయనా! ఇదేం పోయేకాలంరా! విధవని

కట్టుకుంటావా? దేశం గొడ్డు బోయిందా ఏవిఁట్రా'' అంటూ ఒకటే పోరుపెట్టింది. కాని మధు దేనికి సమాధానం చెప్పకుండా తనపని తాను చూచుకోసాగాడు. అమ్మతో ఆర్గ్యుమెంటులోకి దిగితే లాభం ఉండదని అలా చేసి ఉంటాడు. ఆసాయింత్రం ఆవిడ ప్రమీల హాస్టలుకు వెళ్ళింది. తల్లీ, కూతుళ్ళు చాలాసేపు మాట్లాడుకున్నారు. ఆవిడ ఉన్నంతసేపు మాలతి మీనాక్షివాళ్ళ గదిలోనే కూర్చుంది. కాని ఆవిడ వెళ్ళకముందు మీనాక్షి మాలతిని ఆవిడ ముందుకు లాక్కెళ్ళి,

''పిన్నిగారూ! ఈమె మీ అమ్మాయి రూంమేటు, మాలతి.'' అని పరిచయం చేసింది.

ఆవిడకు మాలతి నమస్కారం చేసింది. ఆవిడ మాత్రం మాలతివైపు క్షణం చూచి ముఖం తిప్పేసుకుంది.

* * *

ఇలా ఒక సంవత్సరం గడచిపోయింది. ఎన్ని ఆటంకాలు వచ్చినా మాలతీ మధూలు మాత్రం ప్రేమపక్షుల్లా స్వేచ్ఛగా విహరిస్తూనే ఉన్నారు. మాలతి థర్డు ఇయర్ బి. ఎ., పూర్తి అయ్యేసరికి మధుకి విశాఖపట్నంలో ఉద్యోగం అయింది. మధు వెళ్ళిపోయాడు.

మాలతి కూడ తల్లిని ఒప్పించి ఫోర్తుఇయర్ చదవడానికి విశాఖపట్నం వచ్చింది. తల్లిని తనతో తెచ్చుకు వేరేకాపరం పెట్టింది. మధు మాలతిని తరచు ఇంట్లో కలుసుకుని మాట్లాడటం తల్లి గమనిస్తూనే ఉంది. ఒక రోజు అడిగితే మాలతి సంగతంతా చెప్పింది. ఆవిడ మారు మాట్లాడకుండా అంతా వింది. ఆ రాత్రి మాత్రం కూతురి గూర్చి చాల ఆలోచించింది.

''నేనేదో దాన్ని ఉద్ధరించాననుకొని ఆఖరికి పసుపూ, కుంకానికి నోచుకోలేని దానిలా జేసాను. పోనీ, నేను పాడుచేసిన దాని జీతం, అది ఇలా బాగుపరుచుకుంటుంటే నేను అడ్డగించడం దేనికి?''అని ఆలోచిస్తూ ఒక నిర్ధారణకు వచ్చి మనస్సు తేలిక చేసికొని నిద్రపోయింది.

ఆ సంవత్సరం ఆఖర్లో, మధు వాళ్ళ యింట్లోవాళ్ల ఇష్టాలకి వ్యతిరేకంగా మాలతిని వివాహం చేసికొన్నాడు. క్రొత్త దంపతులు విశాఖపట్నంలోనే కాపరం పెట్టారు.

వాళ్ల జీవితం నిర్మలమైన నదీజలంలో సాఫీగా పోయే పడవలా ఉంది. మధు అత్తగారు కొన్నాళ్లు కూతురువద్ద, కొన్నాళ్లు స్వగ్రామంలో గడుపుతూ ఉండేది. చీకూ, చింతా లేకుండా వాళ్లదినాలు గడచిపోతున్నాయి. పెండ్లిఅయిన రెండో సంవత్సరం మాలతి దోసపండంటి కొడుకుని మధుకు కానుక ఇచ్చింది. దానితో వాళ్ళ ఆనందం మరో మెట్టు పైకెగబ్రాకింది.

వీళ్ళ వార్తలు ప్రమీలకు, వాళ్ల అమ్మకు ఎప్పటికప్పుడు చేరుతూనే ఉన్నాయి. మధు పెండ్లయిన తర్వాత ఇంటి ముఖం చూడడం మానివేశాడు. కాని తల్లికి మాత్రం పంపవలసిన ధనసహాయం పంపుతూనే ఉన్నాడు. కాని రెండు కుటుంబాల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు లేవు. మనవడు పుట్టేడని ఎవరో చెప్పగానే ముసలావిడ తనలో ఉన్న మాతృవాత్సల్యాన్ని ఆపుకోలేక పోయింది. ప్రమీలకు కూడా అన్నయ్యను బిడ్డను చూడాలనిఉంది. మాలతి మీద తనకున్న తొలి అభిమానం మళ్లా చిగిర్చసాగింది. కాని ఏమిచేయాలన్న తన అహంకారం అడ్డువచ్చేది. ఇంతలో మీనాక్షి ఉన్నట్టుండి ఊడిపడింది.

''ఏయ్! ప్రమీలా! నీ అల్లుడు అచ్చంగా నీ పోలికేనోయ్! అత్తా, అత్తా అని కలవరిస్తున్నాడు. అయినా, అంతా అయిపోయి వాళ్లు ఓ కొడుకుని కన్నాతర్వాత కూడా నీకీ పంతమేమిటి చెప్పు!'' అది మీనాక్షి.

''అబ్బే! నాదేమి లేదోయ్! నా కెప్పుడూ ఇష్టమే. కాని అమ్మ....''

''అమ్మ ఏవిఁటే!—నా అభ్యంతరం ఏమీ లేదమ్మాయ్! నీవు విశాఖపట్నం ఎప్పుడు వెళ్తావో చెప్పు. నేనూ వస్తాను. వీళ్లతో నా కేమిటి? నా బిడ్డను నేను చూడాలి,'' అంటూ కళ్ళు ఒత్తుకో సాగింది, ముసలావిడ.

''అదేవిఁటి? పిన్నిగారూ! కంట తడి పెట్టకండి. ఎల్లుండి బయలుదేరుదాం. ప్రమీల కూడా వస్తుంది లెండి.'' అంది మీనాక్షి.

జట్కా మధుసూదన్ ఇంటిముందు ఆగింది. అప్పుడే స్నానంచేసి వచ్చిన మాలతి ముఖం తుడుచుకుంటూ 'ఎవరా' అన్నట్టు గుమ్మం దగ్గరకు వచ్చింది. ముందుగా జట్కాలోనుండి మీనాక్షి దిగడం చూచి,

"ఇదేమిటి మీనాక్షీ, జట్కాలో వచ్చావ్! ఇంకా ఎవరైనా ఉన్నారా?"

"మీ అత్తగార్ని, ఆడబిడ్డని తీసుకొచ్చాను. చూడవోయ్!" అంది మీనాక్షి. మాలతికి కొంత సేపటివరకు తాను విన్నది నిజమా అనిపించింది. వాళ్లు ఇలా వస్తారని ఎప్పుడూ అనుకో లేదు

'అయ్యో! ఆయన సమయానికి ఇంట్లో లేక పోయారే, నేను సరిగా మాట్లాడగలనో, లేదో,' అని అనుకుంటూ ముఖంమీద పట్టిన చెమటను తుడుచుకుంటూ నిలబడింది. ఇంతలో మీనాక్షి, ప్రమీల, వాళ్ల అమ్మ లోనికివచ్చారు. మాలతికి ఏమి చెయ్యాలో తోచడం లేదు.

ఒక్కసారిగా అత్తగారి కాళ్లమీద పడింది. ఆవిడ కోడలిని లేవదీస్తూ—

"లే, తల్లీ! అబ్బాయి ఇంకా డ్యూటీనుండి రాలేదా, చంటాడేడీ?" అంటూ పాతకోడలితో ముచ్చటిస్తున్నట్టే మాట్లాడేసింది.

మాలతి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. కళ్లంట నీరు కారసాగింది. ఇంతలో ప్రమీల—

"ఆదేవిటి మాలతీ!' బొట్టు పెట్టుకోలేదేం, ఎక్కడుంది భరణి? నేనే పెడ్తానుండు" అంటూ చక్కగా కుంకుమతో బొట్టు పెట్టగానే, మాలతి ప్రమీలను గాఢంగా హృదయానికి అదుముకుంది. ఆ ఇంట్లో కొరతగా ఉన్న ఆనందం ఈ నాడు భర్తీ అయింది. అందరూ కలసి చంటాడు పడుకున్న గదిలోకి వెళ్లారు. వాడు కేరింతలు కొడుతూ, నవ్వుతూ ఆడుతున్నాడు. వాళ్లందర్ని చూచి వాడు మరీ నవ్వటం మొదలుపెట్టాడు.

"అబ్బ! వెధవకి ఏం ఆనందంగా ఉంది!" అంది ప్రమీల.

"మరి అత్త వచ్చిందిగా! పెళ్లాన్నిస్తుందని వాడి ఆశ!" అంది మీనాక్షి నవ్వుతూ.

"పోదూ! నీ వేళాకోళం, నువ్వూనూ...."

అందరి నవ్వులతో గది మార్మోగుతూంటే, అప్పుడే వచ్చి బయట నిలబడ్డ మధుకు అంతా అర్థమయి, "నేను చేయలేనిది, చంటాడు చేసాడు" అని అనుకుంటూ వాళ్లందర్ని కలుసుకోడానికి లోనికి వెళ్లాడు. ★

# మన్ను తిన్న పెంజేరు

నాకు నచ్చడు అతడి చందం
ఏపని చేసినా బహు మందం
ఆ పనిలోనూ వుండదు అందం
పైగా, అందరి కాళ్లకు బందం
అతడిని గూర్చి నా ఛందం:
సారంలేని చచ్చు కందం,
వాసనలేని పిచ్చి గంధం,
జీర్ణశక్తి వుడిగిన తుందం
బోలో "భజగోవిందం, భజగోవిందం"

—ఎన్.